

విషకన్య
రేణిగుంట ఉత్తమ్

జూబ్లీహిల్స్, హైదరాబాద్..

రాత్రి పదకొండు గంటల సమయం.

అదో ఐదు నక్షత్రాల హొటల్. అందులోని మోహిని బార్లో కూర్చుని వున్నారు మోహన్, అతని మిత్రుడు అయూబ్. కుర్ర జంటల వెస్ట్రెన్ డ్యాన్సులతో మార్మోగిపోతోందా హాలంతా ! డయాస్ మీద పోల్ డ్యాన్స్ ప్రారంభమైంది. సరిగ్గా అప్పుడు ప్రవేశించాడక్కడికి రమేష్. అతని చేతిలోని సిగరెట్ అతని కళ్ళలా ఎరుపెక్కివుంది. హాల్లో పరికించి చూచిన అతనికి ఓ మూల కూర్చున్న మోహన్, అయూబ్‌లు కనిపించారు. వెంటనే అక్కడికెళ్ళి వాళ్లతో జాయినయ్యాడు.

మ్యూజిక్కు కు తగ్గట్టుగా పోల్ డ్యాన్స్ ప్రారంభమైంది. ఇండియన్ అమ్మాయిలతో పాటు వివిధ దేశాల అమ్మాయిలు దాదాపు తమ ఒంపు,సొంపులన్నీ బహిర్గతమయ్యేలా నర్తిస్తున్నారు.

ఇదంతా ఏమీ పట్టనట్టూ ముగ్గురు మిత్రులు సీరియస్‌గా చర్చించుకుంటున్నారు. పది నిమిషాల తర్వాత ఓ అందమైన అమ్మాయి వాళ్లున్న టేబుల్ దగ్గరకు వచ్చింది. చూపు తిప్పుకోలేని లావణ్యం ఆమెది. రమేష్ ఆమెను చూచి కూర్చోమని సైగ చేసాడు. ఆమె కూర్చున్నాక నలుగురు అరగంట సేపు చర్చించుకున్నారు. మోహన్ ఆమెకు బ్రీఫ్‌కేస్ లోంచి వేయిరూపాయల నోట్ల బండల్ తీసి ఆమెకు యిచ్చాడు. దాన్నందుకుని తన వ్యానిటీ బ్యాగులో వేసుకుని, ఓ సిగరెట్ వెలిగించుకుని అక్కడి నుండి నిష్క్రమించిందామె. పదినిమిషాల తర్వాత ముగ్గురూ అక్కడినుండి బయటపడ్డారు.

ఆమె పేరు ప్రణవి ! సిటీలోని నెంబర్ వన్ కాల్‌గర్ల్ !

అంతేకాదు చావుకి చాలా దగ్గరగా వున్న ఎయిడ్స్ పేషంట్ !

.....

బయటికొచ్చాక ముగ్గురు రమేష్ కార్లో కూర్చున్నారు. కారు కదిలిన ఐదు నిమిషాలకు అయూబ్ అడిగాడు అనుమానంగా..“ రమేష్ ! ఆమె నిజంగా మనం చెప్పిన పని చేస్తుందంటావా ?”

“ మాట తప్పడానికి ఆ అమ్మాయి సినిమా ఏక్టర్ కాదు, రాజకీయ నాయకురాలు కాదు.” ముక్కుసూటిగా మాట్లాడే తత్వం అతనిది.

“కానీ...”

“చూడ్రా ! ఆమె ఈ పని అంగీకరించింది సాటి స్త్రీకి జరిగిన అన్యాయాన్ని సహించలేక ! ఫ్యాక్షనిష్టులకన్నా ప్రాస్టిట్యూట్లకు నీతి వుంటుంది.” సీరియస్‌గా అన్నాడు రమేష్. అతని ముఖంలో ఆవేదన కనిపిస్తోంది.

“ఇంతకీ ఈమె నీకెలా పరిచయం ?”

“ఇప్పుడది అంత అర్జెంటుగా నువ్వు తెలుసుకోవాలా ?”

“అదికాదు..”

“ఏదికాదు ? నీ అనుమానం ఏమిటంటే.. నాకు, ఆ అమ్మాయికి మధ్యేమైనా జరిగిందా అని కదా ! అలాంటిదేమీ లేదు. జస్ట్ పరిచయం. పేదరికం, ఆకలి, పరిస్థితులు, మహా చెడ్డవిరా ! నిస్సహాయిల్ని మరింతగా అవి కృంగదీస్తాయ్. మనిషిని ఎంత నైచ్యానికైనా దిగజారుస్తాయి. అలాంటి సమస్యల్లో చిక్కుకున్న అమ్మాయే ప్రణవి. ఒక్కసారి ఈ ఊబిలోకి దిగాక మళ్ళీ వెనుక్కు తిరగడమనే ప్రశ్నే వుండదు. తను చనిపోయినా ఫర్వాలేదు కానీ కుటుంబం స్థిరపడుతుందనుకునే వాళ్ళు ఎంతమంది వున్నారీ సమాజంలో..! ఈ అమ్మాయి అలా అనుకుంది కాబట్టే ఆ అమ్మాయంటే అభిమానం, గౌరవం, నమ్మకం. చాలా యింకా కావాలా ?”

వాళ్ళ సంభాషణను ఏమాత్రం పట్టించుకోకుండా వున్న మోహన్ కళ్ళు మూసుకుని సీట్లో వెనక్కి వాలాడు. అతని ఆలోచనలు గతంలోకి జారుకున్నాయ్.

"చూడండి మోహన్‌గారూ... మీ శ్రేయోభిలాషిగా ఓ సలహా యిస్తున్నాను. రాచప్పగా ఆఫర్ని మీరు ఒప్పుకుంటే యాభై లక్షలు మీకు ఫీగా పే చేస్తానన్నారు. జీవితంలో యింత పెద్ద మొత్తాన్ని మీరు ఫీ గా పొందలేక పోవచ్చు. పైగా మీకు తెలుసుగా.. రాచప్పగారు అనుకున్నది ఎలాగైనా సాధిస్తారు." ఎలాగైనా అనే పదాన్ని ఒత్తి పలుకుతూ అన్నాడు బృహస్పతి.

మోహన్ భావరహితంగా అతన్ని సూటిగా చూస్తూ అన్నాడు. "అంటే నా ఖరీదు ఏభై లక్షలన్న మాట ! బాగుంది బృహస్పతి గారూ.. మీరు చెబుతున్నట్లుగా నేను అంత డబ్బును ఫీ గా పొందలేక పోవచ్చు. కానీ నా ఆత్మకు ఏమని సమాధానం చెప్పుకోమంటారు ?"

బృహస్పతి అతని మాటల్ని తెలిగ్గా కొట్టిపారేస్తూ అన్నాడు.."ఆత్మ ! పరమాత్మ ! ప్రేతాత్మ ! యిలాంటి అంశాలన్నీ ఏ సన్యాసులో చర్చించు కోవలసిన విషయాలు.. ఏ యుగంలో వున్నారండి మీరు ? వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకుని పైకెదగాలికానీ, యిలా ఆత్మ, దేహం అంటూ మెట్ట వేదాంతం మాట్లాడు తారేంటి ? ఐనా నాకు తెలియకడుగుతున్నాను. ఆ కూలి నాయాళ్ళను నమ్ముకుంటే ఏం ఒరుగుతుంది మీకు ?రాచప్పగారి కేసు వాదించడానికి పోటీలు పడుతుంటారు మీ వకీళ్ళు. అసలు ఆయనకి ఎదురునిల్చి కోర్టులో మాట్లాడడానికే భయపడతారు. అలాంటిది, ఆయనకు ఎదిరించి వాదించడానికి మీరు ఒప్పుకున్నారని తెలిసి, మీ ధైర్యాన్ని, గట్స్‌ని మెచ్చుకుని, రాచప్పగారు, మీలాంటి వకీల్ తన దగ్గర..."

"కుక్కలా పడి వుండాలని, తన చేతిలో కీలుబొమ్మలా వుండాలని భావించి నన్ను ఇక్కడికి పిలిపించారు. అంతేనా ? " అతని మాటల్ని కట్ చేస్తూ అన్నాడు మోహన్.

"చూడండి బృహస్పతిగారు.. మీరంటున్న కూలినాయాళ్ళు, అలగా జనం నా దృష్టిలో పేదరైతులు. తమకడుపులు కాలుతున్నా దేశానికి అన్నం పెడుతున్న మారాజులు. ఇన్నాళ్ళకు ప్రభుత్వం దయతలచి వాళ్ళకి వ్యవసాయం చేసుకుని స్వతంత్రంగా, స్వేచ్ఛగా బ్రతకమని ప్రభుత్వభూమిని పంచి, పట్టాలిస్తే, వాళ్ళను భయపెట్టి,వాళ్ళ భూముల్ని కబ్జా చేసుకున్నారు. ఇదేం న్యాయం అని ప్రశ్నించిన యువకులు మర్నాటి నుండి కనబడ్డంలేదు. వాళ్ళు చచ్చారో, బ్రతికే వున్నారో తెలియక వాళ్ళ కుటుంబాలు తల్లడిల్లి పోతున్నాయి. ఐనా, సోమరిపోతుల్లా పది తరాలు కూర్చున్ని తిన్నాతరగనంత ఆస్తులున్న మీ రాచప్పగారికి ఎందుకింత దురాశ ? ఛస్తే ఏం పట్టుకు పోతారు ? ఇక కొంత మంది లాయర్లు రాచప్పగారి కేసులకోసం పడి చస్తుంటారని అన్నారు. బెటర్ అలాంటివాళ్లను మీరు సంప్రదించండి. నాలాంటి వాళ్ళు ఒకళ్ళ మోచేతి క్రింది నీళ్ళు తాగరని మీ రాచప్ప గారికి నా మాటగా చెప్పండి."

బృహస్పతి ముఖం వివర్ణమైంది. అతని కళ్ళల్లో క్రౌర్యం తొంగి చూస్తుండగా అన్నాడతను. " వెల్ ! మీ లెక్చర్ నాకు బాగా నచ్చింది. మిమ్మల్ని చూస్తే ముచ్చటేస్తోంది. యువరక్తం కదా అలాగే మాట్లాడిస్తుంది. మోహన్ గారూ.. మీకెంతో భవిష్యత్తు వుంది. మరో మారు ఆలోచించుకోండి. ఎందుకైనా మంచిది ఓ సారి మీ కుటుంబంతో కూడా మాట్లాడి నిర్ణయం తీసుకోండి."

మోహన్ సీరియస్‌గా అతని వంక చూచాడు.

"అహ.. ఏంలేదూ.. ఈ బండెదవల్లో నాలో వున్న మంచితనం లేదు. వాళ్ళ అయ్యగారికి, అదే రాచప్పగారికి, అపకారం ఎవరైనా చేస్తారని తెలిస్తే చాలు.. శివాలెత్తిపోయి వాళ్ళ శవాల్ని మోసేస్తారు. ఖర్మకాలి రేపు మీకేమైనా అయితే ఎక్కువ బాధ పడేది మీకుటుంబమే కదా.. అందుకని చిన్న సలహా యిస్తున్నాను" నర్మగర్భంగా అన్నాడు బృహస్పతి.

మోహన్ కుర్చీలోంచి లేచి నిలబడి తాపీగా అన్నాడు "క్షమించండి ! మీరు పొరబడ్డారు. నేను నిర్ణయం తీసుకునే ముందే ఆలోచిస్తాను. తీసుకున్నాక మడమ తిప్పను. ఇక నా కేమయినా ఐతే!? కుటుంబ పరిస్థితి ఏమిటి ? అని నేనింతవరకు ఆలోచించలేదు. ఎందుకంటే నేను భగవంతుణ్ణి నమ్ముతాను. పుట్టించిన వాడికే ప్రాణాలు తీసే అధికారం కూడా వుంది. ఇంతవరకూ నా అవసరాలన్నీ ఆయనే చూసుకున్నాడు. ఇక మీదట కూడా ఆయనే చూచుకుండాడు. బృహస్పతిగారూ.. మీరేమీ అనకోకపోతే నాకో చిన్న అనుమానం. మీకీపేరు ఎవరు పెట్టారండి ? " చివరగా చిరునవ్వుతో ప్రశ్నించాడు మోహన్.

బృహస్పతి ఏదో చెప్పబోయేంతలో తనే కల్పించుకుని చెప్పాడు మోహన్ "ఐ పిటీ..యూ.. సర్లేండి. నాకేమైనా అయితే నాకుటుంబం గురించి బెంగ పడకండి. వాళ్ళను చూచుకోవడానికి కూడా ఆయన వున్నాడుగా.."

అని గోడకు వేలాడుతున్న వేంకటేశ్వరస్వామి బొమ్మను చూపి, తిరిగీ అన్నాడు.. "ఇక నాకు శెలవిప్పించండి. కోర్టులో రాచప్పగార్ని కలుసుకుంటానని చెప్పండి. నమస్తే !" అంటూ వడి,వడిగా ఆ ఇంటినుండి బయటకొచ్చి తన కారులో కూర్చున్నాడు. నిమిషం తర్వాత, ఆ కారు గమ్యం వైపుకి దూసుకుపోయింది.

ఆ క్షణంలో అతనికి తెలియదు తను తెలివైన బలవంతుడితో తలపడబోతున్నానని !

....

రాచప్ప తన చేతిలోని మద్యం గ్లాసును విసిరికొట్టి ఉగ్రంగా అన్నాడు.".ఎంత కండకావరం రా వాడికి ? వాడు బ్రతకడానికి వీల్లేదు. ప్రాణాలతో వాడు తిరుపతికి చేరకూడదు. రేయ్ ! మునిరెడ్డి ..ఏం చేస్తున్నావ్ రా..? బయల్దేరు.. వాడి తల తీసుకురా!

బృహస్పతి వెంటనే కల్పించుకుని అన్నాడు. "అయ్యా తమరు శాంతం వహించాలి. మనమేం చేసినా చేతికి మట్టి అంటుకోరాదు. వాడు ఎక్కడికీ తప్పించుకునే అవకాశం లేదు. ఎందుకంటే వాడికారు పెట్రోల్ ట్యాంక్‌లో కిలో పంచదార పోయించాను. అది మెల్లగా కరిగి పెట్రోల్లో కలసి ఇంజన్లో కెళ్ళే సరికి కాస్త టైం పడుతుంది. ఆతర్వాత వాడికారు ఆగిపోతుంది. ఇదంతా జరిగే సరికి వాడు సరిగ్గా ఘాట్ రోడ్డులో, అడవి మధ్యలో ఒంటరిగా వుంటాడు. ఆ తర్వాత మనవాళ్ళు......"

అతని మాటల్ని విన్న రాచప్ప ముఖం పైశాచికానందంతో మెరిసిపోయింది. బృహస్పతి భుజంపై చేయివేసి అన్నాడు.. "రేయ్ ! నీ బుర్రే..బుర్రరా ! కోర్టులో ఆ కూలి నాకొడుకులు కూడా హాజరు కాకుండా చూసుకో !"

"తమరు నిశ్చింతగా వుండండి. అదంతా నేను చూచుకుంటాను." విషపునవ్వుతో అన్నాడు బృహస్పతి.

"సరే ! మరి గదిలో....."

"అమ్మాయే గా సిద్ధంగా వుంది. మీదే ఆలస్యం" వెకిలిగా నవ్వుతూ చెప్పాడు బృహస్పతి. కుంభకర్ణుడిలా వుండే రాచప్పకు ఒకటే వీక్‌నెస్.. అది స్త్రీ !

.....

నిర్మానుష్యంగా వున్న ఘాట్ రోడ్డుపై ఎనభై కిలోమీటర్ల వేగంతో వెళుతోంది అడ్వకేట్ మోహన్ నడుపుతున్న కారు. కోడూరు నుండి తిరుపతికి చేరుకోవాలంటే మధ్యలోని అడవి గుండా దాదాపు రెండు గంటల ప్రయాణం తప్పదు. మెలికలు తిరిగిన ఘాట్ రోడ్డు మేకపోతును అమాంతం మింగేసి, బద్ధకంగా పడకేసిన కొండచిలువలా వుంది. శీతాకాలమవడంతో మధ్యాహ్నం నాలుగు గంటలకే ఆరుగంటలైనట్లు అనిపిస్తోంది. వాతావరణం చల్లగా వుండటంతో కారులోని ఏ.సి.ని కట్టేసాడు. సీ.డీ. ప్లేయర్లో నుండి ఘంటసాలవారి పాటలు శ్రావ్యంగా వినిపిస్తున్నా అతను ఆస్వాదించలేక పోతున్నాడు. గంట క్రితం జరిగిన సంఘటన తాలూకు ప్రభావంతో, తీవ్రంగా ఆలోచిస్తున్నాడతను.

త్వరగా గమ్యానికి చేరుకోవాలని కారుని మరింత వేగంగా నడపసాగాడు.

శెట్టిగుంట దాటి బాలపల్లి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది మోహన్ నడుపుతున్న కారు. ఫర్లాంగు పయనించాక, ఓ మలుపులో హఠాత్తుగా చిన్నపాటి కుదుపుతో ఆగిపోయింది.

మోహన్ ఆలోచనల్లోంచి తేరుకుని,కారెందుకు ఆగిపోయిందో అర్థంకాక, మళ్ళీ యిగ్నిషింగ్ చేసాడు. కారు కదలనని మొరాయించింది. పెట్రోల్ ఇండికేటర్ వంక చూచాడు. అరట్యాంక్ నిండా పెట్రోలున్నట్లు చూపిస్తోంది. కారులోంచి దిగి, బానెట్ ఓపెన్ చేసి తనకు తెలిసిన చిన్నపాటి పరిజ్ఞానంతో పరిశీలించాడు. అంతా సవ్యంగానే వుందనిపించింది. మరెందుకు ఆగిపోయిందో అర్థంకాలేదతనికి. ఓసారి చేతి గడియారం వంక చూచుకున్నాడు. టైం దాదాపు ఆరు గంటలు కావొస్తోంది. సంధ్యాసమయం కావడంతో గూటికి చేరే పక్షుల అరుపులతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోతోంది. మెల్లగా చుట్టూ చీకటి అలుముకుంటోంది.

హఠాత్తుగా అతనికి భార్య హరిప్రియ గుర్తుకొచ్చింది. తను యింకా ఇంటికి చేరకపోవడంతో కంగారు పడుతూ వుంటుంది. తను బయలుదేరుతుండగా పిల్లి ఎదురవడంతో అపశకునమని, ఈరోజుకి ఇంట్లోంచి కదలొద్దని ఒకటే గొడవ. ఆమెకు మూఢనమ్మకాలెక్కువ. హేతుబద్ధంగా ఆలోచించే తను యిలాంటివి పట్టించుకోడు. మోహన్ జేబులోంచి సెల్‌ఫోన్ అందుకున్నాడు. లో బ్యాటరీ యిండికేట్ చేస్తుండటంతో విషయం భార్యకు చెప్పి తన ఆఫీస్ చూచుకనే బాల్యమిత్రుడు అయూబ్‌కి తెలియజేయాలని ప్రయత్నిస్తుండగానే సెల్ ఆగిపోయింది. ఏంచేయాలో పాలుబోక సిగరెట్ వెలిగించుకుని కారుని లాక్ చేసి, ఏవైనా వాహనాలు రాకపోతాయా అని ఎదురుచూస్తూ బ్యానెటెక్కి కూర్చున్నాడు.పది నిముషాలు గడచిపోయాయి. ఒక్కవాహనం కూడా వస్తున్న జాడ కనిపించక పోవడంతో అసహనంగా క్రిందికి దిగి చుటూ

ట్టకలియజూసాడు. తాను తప్ప ఆప్రాంతమంతా నిర్మానుష్యంగా కనిపించింది. అడవి కీచురాళ్ళ శబ్ధంతో దద్దరిల్లుతోంది.ఇక లాభంలేదనుకుని, గమ్యం వైపుకి అడుగులేయసాగాడు.

ఆక్షణంలో అతనికి తెలియదు దురదృష్టం తన్ను వెంటాడుతోందని.

.....

హరిప్రియకు ఆందోళనగా వుంది. తన భర్త మోహన్ కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా సిగ్నల్ అందుబాటులో లేదని వస్తుండటంతో మరింత కంగారుగా వుంది. కంగారుగా పచార్లు చేయసాగింది. ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. మోహన్ వచ్చాడనుకుని ఆనందంగా పరిగెట్టుకెళ్లి తలుపు తెరిచిన ఆమెకు అక్కడెవరూ లేకపోవడంతో తను భ్రమ పడిందనుకుంది.

....

మోహన్ ఓ మలుపు తిరుగుతుండగా వెనుక వైపు నుండి దూరంగా ఏవో వాహనాలు వస్తున్న సూచనగా హెడ్లైట్ల వెలుగు కనిపించింది. కాసేపు ఆగితే వాళ్ళని లిఫ్ట్ అడిగి గమ్యం చేరుకోవచ్చని తలచిన అతను అక్కడే నిలబడిపోయాడు.

.....

నిరాశగా వెనక్కి తిరిగిన ఆమెకు తమ గుమ్మంలో వుంచిన గిఫ్ట్‌ప్యాక్ కనిపించింది. తన భర్తే తనను ఆటపట్టించడానికి యిలా చేస్తున్నాడని భావించి గిఫ్ట్‌ప్యాక్ ను తీసుకుని లోపలికి వెళ్ళింది. గిఫ్ట్‌ర్యాప్ తీస్తుండగా హఠాత్తుగా పేలి ముక్కలయి పోయిందా ప్యాక్. దాంతోపాటు హరిప్రియకూడా....!

......

తన ఇంటి ముందు జనం గుమికూడి వుండటం, పోలీసువ్యాన్, అంబులెన్స్ వుండటంతో షాక్కు గురయ్యాడు మోహన్. అతనికోసమే ఎదురు మిత్రుడు అయూబ్ కన్నీళ్ళతో అతనికెదురెళ్ళాడు.ఏం జరిగిందని తెలుసుకునే లోపునే ఇంట్లోకి ప్రవేశించి అక్కడ కనిపించిన భీభత్సకరమైన దృశ్యానికి ఒక్కసారిగా కూలబడ్డాడు. మోహన్ని పోలీస్ ఇన్స్‌ఫెక్టర్ ప్రశ్నించడం మొదలెట్టాడు.

....

సరిగ్గా ఈ సంఘటన జరిగిన మూడు నెలల తర్వాత!

రాచప్ప చాలా ఆనందంగా వున్నాడు. గతవారం రోజులుగా ఓ అమ్మాయితో గడుపుతున్నాడు తను. అతను ఓ కొత్తరకం శృంగారాన్ని రుచి చూసాడు. బృహస్పతి ఎలా పట్టాడో తెలియదుగానీ, తనకు ఆ అమ్మాయిని పరిచయం చేసి జన్మ ధన్యమైందనిపించాడు. స్వర్గం ఎలా వుంటుందో తెలియని తనకు ఆ అమ్మాయితో గడిపిన తర్వాత బహుశా యిలాగే వుంటుందేమో అనుకునేలా చేసింది.

రాచప్ప ఆ అమ్మాయిని వదలిపెట్టాక బృహస్పతి కూడా కక్కుర్తి పడ్డాడు.

ఆ అమ్మాయి..... ఎయిడ్స్ పేషంట్ ప్రణవి !

సరిగ్గా అప్పుడు మ్రోగింది అతని గదిలో ఫోన్...

అవతల వ్యక్తి చెప్పింది విని బృహస్పతి స్పృహ తప్పాడు.

అమాయకురాలైన తన భార్యను దారుణంగా చంపిన నేరానికి రాచప్పకు, బృహస్పతికి మోహన్ తన స్నేహితుల సహాయంతో విధించిన శిక్ష అది.

....

మరో నాలుగు నెలల తర్వాత మూడు చావు వార్తలు తెలిసాయి మోహన్ కి.

మొదటిది....తనకు ఎయిడ్స్ సోకిందని తెలిసి ఎవరికీ చెప్పుకోలేక, కుమిలి,కృశించి, నశించిన బృహస్పతి !

**తర్వాతది..... బృహస్పతి ఎందుకు చచ్చాడో తెలిసాక, తనకూ ఆ మాయరోగం అంటుకుందని తెలిసి హార్ట్ఎటాక్‌తో చచ్చిన రాచప్ప!**

**మూడవది... ప్రణతి! చనిపోతూ కూడా, సామాన్య ప్రజలకు రాక్షసపీడను వదిలించిన విషకన్య !**

“